కంటయ్య కుంటలో అధికారుల సర్వే

కంటయ్య కుంట సర్వేలో పాల్గొన్న ఆర్ఐ ప్రీతి

నిజాంపేట, డిసెంబర్ 30: నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'కబ్జా కోరల్లో కంటయ్య కుంట' కథనానికి మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం ఆర్ఐ ప్రీతి, సర్వేయర్ శ్రీకాంత్, సిబ్బంది నిజాంపేటలోని కంటయ్య కుంటను సందర్శించారు. ఆక్రమణ గురైన కుంట స్థలాన్ని పరిశీలించి, కుంట చుట్టూ సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. కుంట స్థలం ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వారితో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహారాజు తదితరులు ఉన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, డిసెంబర్ 30: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ మహేందర్, అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, డిసెంబర్ 30: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నదని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ప్రజల అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ.గౌస్, బాబు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో నర్సాపూర్ విద్యార్థినికి రజత పతకం

బి.శ్రావిక

నర్సాపూర్,డిసెంబర్ 30: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న బి.శ్రావిక రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి రజత పతకాన్ని సాధించింది. జిల్లా ఉషు కోచ్ పూర్ణ చందర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29 వరకు సీఎం కప్ ఉషు రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగాయన్నారు. జిల్లా తరపున 56 కేజీల వెయిట్ విభాగంలో బి.శ్రావిక పాల్గొని రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. శ్రావికను జిల్లా డివైఎస్‌వో నాగరాజు, డీఈవో రాధాకిషన్ అభినందించారు.

విద్యార్థుల సమస్యలపై చిత్తశుద్ధి లేదు

– బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30: విద్యార్థుల సమస్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యార్థుల మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులకు నష్టం

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. వార్షిక పరీక్షల దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులు సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేనిచో విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్ పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగరాం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధికం గల బీసీ రిజర్వేషన్లు పెంచేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతామన్నారు.

డీ సెట్ మూడో దశ ఆప్షన్లు ఇవ్వాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30: డైట్ సెట్ (డీసెట్) 2024కు సంబంధించి మూడో దశ వెబ్ ఆప్షన్లను జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు ఇవ్వాలని డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆప్షన్లు ఇచ్చిన వారికి జనవరి 9న సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు 13వ తేదీలోగా ప్రవేశ లెటర్ పొంది 16న కేటాయించిన కళాశాలలో చేరాలన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

మెదక్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా నిరుద్యోగ నియామకాలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని మహాగర్జన రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. జనవరి 19న హైదరాబాద్‌లో మహాగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డప్పు చెప్పు వృత్తిదారులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బుర్ర ప్రభాకర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర లింగం మాదిగ, కార్యదర్శి ఎర్రోళ్ల సంజీవ్, మెదక్ మండల అధ్యక్షుడు డప్పు శ్రీనివాస్ మాదిగ, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లారం సుమన్ మాదిగ, మిద్దె సంజీవులు మాదిగ, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండమీద దుర్గయ్య పాల్గొన్నారు.

రాంరెడ్డి కుంట కబ్జాపై ఫిర్యాదు

వెల్దుర్తి, డిసెంబర్ 30: పది ఎకరాల విస్తీర్ణం గల కుంటను కబ్జాకు పాల్పడుతున్నారని, వారి నుంచి కాపాడాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణకు సోమవారం సీపీఎం నాయకులు గౌరీ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌరీ మాట్లాడుతూ ఏదులపల్లి గ్రామ శివారు సర్వే నం. 95లో పది ఎకరాల విస్తీర్ణం గల రాంరెడ్డి కుంట ఉందని, ఈ కుంటను చుట్టుపక్కల వారు దీని విస్తీర్ణాన్ని పూర్తిగా తగ్గిస్తూ కబ్జా చేస్తున్నారన్నారు. రాంరెడ్డి కుంటను సర్వే చేసి కుంట కబ్జాను తొలిగించాలని తహసిల్దార్‌ను కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఎమ్మెల్యే, అదనపు ఎస్పీ పరామర్శ

నర్సాపూర్: సాయికుమార్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్ అర్బన్: సాయికుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

నర్సాపూర్, డిసెంబర్ 30: నర్సాపూర్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ సాయికుమార్ కొల్చారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్థానిక పెద్దమ్మ కాలనీలోని సాయికుమార్ ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు సూరారం నర్సింహులు, చౌటి జగదీశ్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాంచందర్ ఉన్నారు.

మృతదేహానికి అదనపు ఎస్పీ నివాళి

మెదక్ అర్బన్, డిసెంబర్ 30: కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్న హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్ మృతదేహానికి అదనపు ఎస్పీ మహేందర్ సోమవారం నివాళులర్పించారు. సాయికుమార్ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. సాయికుమార్ మృతి వార్త పోలీస్ యంత్రాంగాన్ని కలచివేసిందన్నారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ, నర్సాపూర్ ఎస్సై, కొల్చారం ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చిలిపిచెడ్, డిసెంబర్ 30: నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎంతో కష్టపడుతున్నారని బధ్రియ తండా మాజీ సర్పంచ్ బుజ్జిబాయి, బీఆర్ఎస్ నాయకుడు ఖాసీం అన్నారు. సోమవారం చండూర్‌కు చెందిన ఆనంద్‌కు రూ.60వేలు, రాణికి రూ.22,500, బధ్రియ తండాకు చెందిన గిరీందర్‌కు రూ.60 వేలు, రాధికకు రూ.12,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. చిట్కుల్‌కు చెందిన పోచయ్యకు రూ.25 వేల చెక్కును అందజేశారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, డిసెంబర్ 30: మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ సోమవారం అందజేశారు. మంతూరుకు చెందిన పోచయ్యకు రూ.55 వేలు, లోకేశ్‌కు రూ.60 వేలు, రాంచంద్రాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌కు రూ.48 వేలు, రుస్తుంపేట్‌కు చెందిన సుదీప్‌కు రూ.26 వేలు, రెడ్డిపల్లికి చెందిన సత్యనారాయణకు రూ.18 వేలు, సీతారాంపూర్‌కు చెందిన వీరస్వామికి రూ.5 వేలు మంజూరైన చెక్కులను అందజేశారు.

సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

బహుమతులు అందజేస్తున్న వెల్దుర్తి ఎంఈవో

చిన్నశంకరంపేటలో ..

మెదక్‌లో..

విజేతలకు బహుమతుల అందజేత

మెదక్ మున్సిపాలిటీ/మెదక్‌రూరల్, డిసెంబర్ 30: సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఫోరం కన్వీనర్ సత్యనారాయణ, కో కన్వీనర్ సంగీత తెలిపారు. మెదక్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండలస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. విజేతలకు ఎంఈవో నీలకంఠం బహుమతులు అందజేశారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, డిసెంబర్ 30: చిన్నశంకరంపేట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో ఇంగ్లిష్, తెలుగు మీడియాల విభాగాల్లో పరీక్ష నిర్వహించారు.

నిజాంపేటలో..

నిజాంపేట, డిసెంబర్ 30: నిజాంపేటలోని ఉన్నత పాఠశాలలో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో యాదగిరి ప్రశంస పత్రాలతో పాటు మెమోంటోలు అందజేశారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 30: మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులు, మెమోంటోలు అందజేశారు.

విద్యార్థులు పోటీత్వాన్ని పెంపొందించుకోవాలి

చేగుంట, డిసెంబర్ 30: సోషల్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో పోటీ పరీక్ష నిర్వహించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ జిల్లా కార్యవరం ఎన్నిక

నూతన కార్యవర్గం

మెదక్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కంచి ఆనంద్ ఎన్నిక య్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో ఫొటో, వీడియోగ్రాఫర్స్ ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కూచన శ్రీధర్, కోశాధికారిగా బండ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గెలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ల ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఫొటో గ్రాఫర్స్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, కోశాధికారి మాధవరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారాడు కేదార్‌రెడ్డి, రాష్ట్ర కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ నాగరాజు, ఎన్నికల కమిటీ సభ్యులు శశివర్ధన్‌రెడ్డి, తిమ్మరిశెట్టి రామకృష్ణ, మంద రామకృష్ణ, విగ్నేస్ రాజు, విక్రమ్, ఎం.శ్రీనివాస్, గిరి, సురేందర్, చింతల రవీందర్ పాల్గొన్నారు.

పండిత్ పరిషత్ జిల్లా కమిటీ ఏర్పాటు

నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిజాంపేట, డిసెంబర్ 30: నిజాంపేటలోని ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సోమవారం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలుగా వెంకటస్వామి, మల్లయ్య, మహిళా కార్యదర్శిగా వందనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నసీరోద్దీన్, లింగం, మహేందర్ ఉన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఎంఈవో

ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో నీరజ

చేగుంట, డిసెంబర్ 30: చేగుంటలోని గీతా పాఠశాలలో ఫుడ్ ఫెస్టవల్‌ను ఎంఈవో నీరజ, పలువురు ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. తెలంగాణతో పాటు ఇక్కడే స్థిరపడ్డ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తయారు చేసిన వంద రకాల వంటకాలను సోమవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం కల్పన, కరస్పాండెంట్ ప్రసాద్, చల్లా లక్ష్మణ్, పెంటాగౌడ్, నరసింహరావు, యాదగిరి, నరసింహారెడ్డి, పద్మ, సురేశ్, విఠల్‌రెడ్డి, నంగునూర్ సురేశ్ తదితరులున్నారు.

ఘనంగా మాతృవందన యాత్ర

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30: గొండు రాణి దుర్గావతి 500వ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందు పరిషత్ మెదక్ విభాగ్, దుర్గావాహిణి–మాతృశక్తి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో మాతృవందన యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీకేఆర్ గార్డెన్ నుంచి మహిళలు త్రిశూలాలు చేతపట్టి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

నిజాంపేట, డిసెంబర్ 30: అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలని ఆర్ఐ ఇమాద్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో సోమవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆర్ఐ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలను కులం పేరిట అగౌరవంగా మాట్లాడినా, వారి పట్ల వివక్షత చూపినా చట్టరీత్యా నేరమాని తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, ఏఎస్సై జైపాల్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, గ్రామస్తులు ఉన్నారు.

ఉపాధ్యాయ పట్టభద్రుల తుది ఓటరు జాబితా ప్రచురణ

- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ –కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం, పట్టభద్రుల తుది ఓటరు జాబితాను సోమవారం ప్రచురించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితా రెవెన్యూ డివిజనల్, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ల వద్ద, పట్టభద్రుల నియోజకవర్గ స్టేషన్ల వద్ద పరిశీలన కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో నమోదైన ఉపాధ్యాయులు, అలాగే పట్టభద్రులు తమ ఓటర్ జాబితాను వివరాలను పరిశీలించి, సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్స్–21 కాగా, పురుషులు: 766, స్త్రీలు 515, ట్రాన్స్‌జెండర్స్–00, మొత్తం ఓటర్లు 1281 అని తెలిపారు. జాబితా వివరాలు పోలింగ్ స్టేషన్స్–22, పురుషులు 8533, స్త్రీలు 3420, టాన్స్ జెండర్స్–00 మొత్తం మొత్తం– 11953 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

సామాజిక స్పృహ ఉన్న వ్యక్తినే గెలిపించండి

జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ శాసనమండలి అభ్యర్థి

రామాయంపేట, డిసెంబర్ 30: సామాజిక స్పృహ ఉన్న వ్యక్తికే మొదటి ప్రాధాన్యత ఓటేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని బీఆర్ఎస్ మండలి అభ్యర్థి పిడిశెట్టి రాజు తెలిపారు. సోమవారం రామాయంపేటకు విచ్చేసిన అభ్యర్థి పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించి, మాట్లాడారు. తెలంగాణ విద్యా విధానంలో మార్పులు రావాలంటే విద్యావేత్తతోనే సాధ్యమన్నారు. అందుకు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి మండలికి పంపాలని కోరారు. కేసీఆర్ చొరువతోనే తాను ముందుకొచ్చానన్నారు. సార్ ఆశీస్సులతో తనను శాసన మండలికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని, శ్రీనివాస్, సామాజిక నిపుణులు బెస్త రవి, రెడ్డమైన నరేశ్, పుట్టి శ్రీనివాస్, చింతల శేఖర్, పిట్ల శ్రీశైలం ఉన్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

క్వార్టర్ ఫైనల్‌లో తలపడుతున్న జట్లు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 30: జిల్లా కేంద్రంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు అద్యంతం ఉత్కంఠభరితంగా కొసాగుతున్నాయి. సోమవారం వివిధ జిల్లాల పురుషులు, మహిళల జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ పోటీలు జరిగాయి. పురుషుల విభాగంలో నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల జట్లు సేమి ఫైనల్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, హైదరాబాద్ జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఫైనల్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లా ఇన్‌చార్జి యువజన క్రీడల అధికారి నాగరాజు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్, వ్యాయమ ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, రవి, రాజేందర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా పెంచాలి: తూప్రాన్ డీఎస్పీ

శివ్వంపేట, డిసెంబర్ 30: నేరాల అదుపునకు గ్రామాల్లో మరింత నిఘా పెంచాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించి పలు రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరం దృష్ట్యా ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపకుండా వాహనాల తనిఖీ చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరుపై గ్రామాలలో మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్సై మధుకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కారు అదుపుతప్పి మహిళ మృతి

ప్రమాదంలో మృతి చెందిన నవ్య

కొల్చారం, డిసెంబర్ 30: కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన చంద్రకాంత్ తన భార్య నవ్య(28), కూతుళ్లు సహస్ర, తన్వీలతో కలిసి నగరం నుంచి తన మారుతి ఎర్టిగా కారులో ఏడుపాయల వన దుర్గాభవానీ దర్శనం కోసం వస్తున్నారు. కొల్చారం మండలంలోని అప్పాజిపల్లి శివారులో ఉన్న స్కూల్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయానిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం అంబులెన్స్ సహాయంతో మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు. నవ్య పరిస్థితి విషమించడంతో డాక్టర్ సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీకి వచ్చి ఫుల్‌గా తాగి నిద్రపోయిన వ్యక్తి

మద్యం దుకాణం

చేగుంట, డిసెంబర్ 30: మద్యం దొంగిలించేందుకు వచ్చిన ఓ వ్యక్తి, ఫుల్‌గా మద్యం తాగి వైన్స్‌లో పడుకుని దొరికిపోయిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నార్సింగి పోలీసులు, వైన్స్ యజమాని పర్శగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మండల కేంద్రంలోని శేరిపల్లి రోడ్డులో ఉన్న కనుక దుర్గ వైన్స్‌లో నిత్యంలాగే ఆదివారం రాత్రి 10గంటలకు నిర్వాహకులు వైన్స్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. వేరే రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి వైన్స్ పై కప్పు రేకులు తొలిగించి, అందులోని డబ్బు, మద్యం, సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్‌లు ఓ సంచిలో మూటకట్టుకున్నాడు. మద్యం తాగిన మత్తులో దొంగతనానికి వచ్చిన సంగతి మర్చిపోయి ఫుల్‌గా మద్యం తాగి స్పృహ కోల్పోయి, అక్కడే పడుకున్నాడు. సోమవారం ఉదయం వైన్స్‌ను తెరిచి చూడగా అందులో నిద్రిస్తున్న ఒక వ్యక్తిని గమనించి వైన్స్ నిర్వాహకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం 108 వాహనంలో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

దశదినకర్మకు వెళ్లి అనంతలోకాలకు..

స్వామి (ఫైల్)

రామాయంపేట, డిసెంబర్ 30: దశదినకర్మకు వెళ్లిన ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని ప్రగతి ధర్మారంలో సోమవారం జరిగింది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. నస్కంటి స్వామి(25) అదే గ్రామంలో తన పాలివాళ్ల ఇంట్లో దశదినకర్మకు వెళ్లాడు. తలనీలాలు తీసుకుని, చెరువులో స్నానానికి దిగాడు. చెరువులోకి దిగిన వ్యక్తి ఎంతకూ బయటకు రాకపోవడంతో అక్కడే ఉన్న కొంతమంది చెరువులో గాలించారు. నాలుగు గంటల పాటు యువకుడు చెరువులోనే గల్లంతయ్యాడు. చివరికి విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గజఈతగాళ్లతో చెరువులో గాలించారు. చెరువులోనే ఓ జేసీబీ గుంతలో యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

పనికోసం వచ్చి దాబాలో చోరీ

వెల్దుర్తి, డిసెంబర్ 30: దాబాలో పనికొచ్చిన వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన మాసాయిపేట శివారు 44వ జాతీయ రహదారిపై ఉన్న కునాల్ దాబాలో ఆదివారం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన హరిశంకర్‌చౌదరి మాసాయిపేట శివారు 44వ జాతీయ రహదారిపై కునాల్ దాబాను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 26న గజ్వేల్‌కు చెందిన సఫీ దాబాకు వచ్చి తాను వంట మాస్టర్‌గా పని చేస్తానని, తనకు పని కల్పించాలని కోరాడు. దీంతో యజమాని హరిశంకర్‌చౌదరి, సఫీని పనిలో పెట్టుకున్నాడు. రోజువారీలాగే ఆదివారం డాబాలో దేవరాజ్, సుశాంత్ మండల్, సఫీతో పాటు సెక్యూరిటీ అ